క్లుప్తంగా

సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ప్రతిభ



దోమకొండ : సైన్స్‌ఫేర్‌తో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీయవచ్చని జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని త్రివేణి పాఠశాలలో జరుగుతున్న సైన్స్‌ఫేర్‌ను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రయోగాలను ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ నవీన్ కుమార్, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని యాచారంలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. అనంతరం ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ దేవిసింగ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా పోలియో సర్వే



భిక్కనూరు : పోలియో నివారణ చుక్కల మందుపై వైద్య సిబ్బంది మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సోమవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. పోలియో చుక్కలు వేసుకున్న విషయమై సర్వే నిర్వహించి ప్రతి ఇంటికి నంబర్లు వేశారు.

చెక్కుల పంపిణీలో గందరగోళం

భిక్కనూరు : మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నేతలు వాగ్వాదానికి దిగారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రమే స్టేజీపై పాల్గొనాల్సి ఉండగా బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు ఒకేసారి స్టేజీ మీదికి రావడంతో గందరగోళం ఏర్పడింది. ఎమ్మెల్యే కేవీఆర్ చొరవతోనే చెక్కులు వచ్చాయని బీజేపీ నేతలు, తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నందునే చెక్కులు వచ్చాయని కాంగ్రెస్ నేతలు వాదులాడుకున్నారు. అనంతరం తహసీల్దార్ ఇరు వర్గాలను సముదాయించి చెక్కులను పంపిణీ చేయించారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి టౌన్ : జిల్లాలో జరిగిన ఇంటర్ పరీక్షల్లో సోమవారం జరిగిన ఫస్ట్ ఇయర్ పరీక్షలకు జనరల్ విద్యార్థులు 8,691 గాను 8,346 హాజరుకాగా, ఒకేషనల్‌లో 1,602 విద్యార్థులకు 1,467 హాజరై 135 మంది గైర్హాజరైనట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు.

ఎల్లారెడ్డి : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్ షేక్ సలాం, డీఎస్సీ సభ్యుడు శ్రీనాథ్ సోమవారం పరిశీలించారు. చీఫ్ సూపరింటెండెంట్ హేమచంద్ర ఉన్నారు.

ప్రణాళికతో చదివితే విజయమే..



లింగంపేట(ఎల్లారెడ్డి): సంకల్పబలం, ఆత్మవిశ్వాసం, ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం మనదే అవుతుందని విజయస్ఫూర్తి కార్యక్రమంలో బాగంగా హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు వివరించారు. సోమవారం లింగంపేట మండలం పోతాయిపల్లి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంస్థ నుంచి పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు హేమంత్‌కుమార్, అజయ్, రాజశేఖర్, బాలయ్య, హెచ్‌ఎం అంజల్‌రెడ్డి, ప్రవీణ్, కృష్ణాకర్‌రావు, సంగాగౌడ్ తదితరులున్నారు.

బస్టాండ్ భూమి కబ్జాపై ఫిర్యాదు

రాజంపేట : రాజంపేట మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణ స్థలం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమిస్తున్నాడని చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ వైస్ ఎంపీపీ దుబ్బని సావిత్రి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో చేసుకున్న ఒప్పందాన్ని కాదని స్థలం కబ్జాకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయమై ఇట్టం చిన్న సిద్ధిరాములు సాక్షి వివరణ కోరగా ఒక గుంటకు, గుంటన్నర స్థలం మాత్రమే ఇస్తామని ఒప్పందంలో ఉందని, ఆ నిబంధన మేరకే ప్రయాణ ప్రాంగణానికి స్థలమిచ్చామని, తాము ఎలాంటి కబ్జాలకు పాల్పడట్లేదని పేర్కొన్నారు.

1వ తేదీన వేతనాలపై హర్షం

కామారెడ్డి అర్బన్ : జిల్లాలోని అన్నిశాఖల ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటవ తేదీనే జీతాలు వచ్చాయని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బి సాయిలు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజాపాలన సేవాకేంద్రాలు ప్రారంభం




భిక్కనూరులో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ జాంగారి గాలిరెడ్డి, నాగిరెడ్డిపేటలో..



పెద్దకొడప్‌గల్‌లో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్థానిక ఎంపీపీ రాజ్‌దాస్ చేతులమీదుగా ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పర్బన్న మాట్లాడుతూ గ్రామజ్యోతి ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులు చేసుకున్న ఏవైనా సందేహాలు ఉంటే సేవాకేంద్రంలో సంప్రదించాలన్నారు. దరఖాస్తుదారులు సేవాకేంద్రం ఆపరేటర్ చిరంజీవులును సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకట్రాంరెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో..

భిక్కనూరు : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవ కేంద్రంను ఎంపీపీ జాంగారి గాలిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి రూరల్ : ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకుని వారు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపీడీవో లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎవరైనా దరఖాస్తులు చేసుకొని వారు ఉంటే వారు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. గతంలో దరఖాస్తులు చేసుకున్న వాటిలో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిదిద్దుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : ప్రతిఒక్కరు ప్రజాపాలన కార్యక్రమన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ పారంభించారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు ప్రస్తుతం ప్రజాపాలన కేంద్రంలో ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ విఠల్, తదితరులు పాల్గొన్నారు.

కారు దిగుతున్న నేతలు

- నేడు మాజీ మంత్రి సమక్షంలో హస్తం కండువా కప్పుకోనున్న నాయకులు



బాన్సువాడ : బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేతలు కారు దిగి హస్తం గూటికి చేరుతున్నారు. ఒకప్పుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అడ్డాగా ఉన్న బాన్సువాడ నేడు హస్తం గూటికి చేరుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ హవా కొనసాగింది. నియోజకవర్గం నుంచి ఏడు సార్లు గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంత్రిగా, స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బాన్సువాడ అంటేనే పోచారం అడ్డాగా మార్చుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన పోచారం చరిత్రను తిరగరాశారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. పెద్దాయనకు ఎమ్మెల్యేగా గెలిపించినప్పటికి ఆయన వెంటే ఉన్న నేతలు ఒక్కొక్కరు చేయిస్తున్నారు. నియోజకవర్గంలో పోచానానికి అత్యంత సన్నిహితంగా ఉండే కోటగిరి, వర్ని, నస్రుల్లాబాద్, బాన్సువాడకు చెందిన ముఖ్య నేతలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా వందల సంఖ్యలో ముఖ్య నేతలు కారు దిగి చేయందుకుంటున్నారు. పోచారం ముఖ్య అనుచరులే కాకుండా ఆయన బంధువులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడంతో పెద్దాయనకు ఎదురుదెబ్బ తగులుతుంది. ప్రజా సమస్యల కోసం, ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన పెద్దాయన అనుచరులు, బంధువులు పార్టీ మారుతుండడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని తానై పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయం కోసం కృషి చేసిన ముఖ్య నాయకులైన కొందరిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుతం వందల సంఖ్యలో కండువాలు మారుస్తున్న నేతల పట్ల బీఆర్ఎస్ అధిష్టానం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. నియోజకవర్గంలోని నస్రుల్లాబాద్‌కు చెందిన ముఖ్య నేతలు, మాజీ సర్పంచులు అధిక సంఖ్యలో మంగళవారం మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. పార్టీలు మారుతున్నప్పటికీ బీఆర్ఎస్ అధిష్టానం బుజ్జగింపులు చేపట్టకపోవడంతో పలు అనుమానాలకు రేకెత్తుతున్నాయి.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



బాన్సువాడ రూరల్ : బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్ట కాలనీ, కొల్లూర్ గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొయ్యగుట్టలో జెండా ఆవిష్కరణ అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు భారీ గజమాలతో సన్మానించారు. కొల్లూర్ గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సమీప బంధువులు, 30 ఏళ్లుగా వెన్నంటి ఉన్న ఆర్ బాపురెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డితో పాటు ఈ సాయిలు, జి సాయిలు, చింబోలి విఠల్ తదితరులు సుమారు 200మంది కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. నాయకులు నార్లరత్నకుమార్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, కూనిపూర్ రాజిరెడ్డి, నార్ల సురేష్ తదితరులున్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి రిటర్నింగ్ అధికారి

నిజాంసాగర్(జుక్కల్): పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీగా సాగేలా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల ఇన్‌చార్జి రిటర్నింగ్ అధికారి భుజంగరావు అన్నారు. సోమవారం మద్నూర్ మండల తహశీల్ కార్యాయం నందు నియోజకవర్గస్థాయి ఎన్నికల సెక్టోరియాల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో వసతులు, రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని, సెక్టోరియల్ అధికారులు పోలీస్ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎస్సైలు, ఏఎస్సైలు, ఎంఈవోలు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ లీకేజీలపై నిర్లక్ష్యం



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మిషన్ భగీరథ పైపు లీకేజీకి మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ట్యాంక్ వద్ద మిషన్ భగీరథ తాగునీటి పైప్ పగిలి నీరు వృథాగా పోతున్నాయి. వారం రోజుల క్రితం మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే లీకేజీ మరమ్మతులు చేయించిలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తత అవసరం



పెద్దకొడప్‌గల్‌లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై రాములు

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఏఎస్సై రాములు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రజలకు పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై రాములు మాట్లాడుతూ ఫోన్‌లో ఓటీపీ అడిగితే ఎవరికీ చెప్పవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సాయి శివ, అంజి సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ కాశీగా విరాజిల్లుతుంది



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని దుర్కి గ్రామ శివారులో ఉన్న సోమలింగేశ్వర ఆలయం దక్షిణ కాశీగా విరాజిల్లుతుందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. శివరాత్రి వరకు ఆలయంలో పనులు పూర్తవుతాయన్నారు. ఆలయం అభివృద్ధికి అనునిత్యం పాటుపడుతానన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

వంద రోజుల్లోనే గ్యారంటీల అమలు




పట్టణంలో జీరో విద్యుత్ బిల్లు అందిస్తున్న కౌన్సిలర్ జ్ఞానేశ్వరి, నిజాంసాగర్‌లోని మహమ్మద్ నగర్‌లో..

కామారెడ్డి టౌన్ : వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను పూర్తి చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, 31వ వార్డు కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరి తెలిపారు. సోమవారం వార్డులో గృహజ్యోతి 200 యూనిట్ల విద్యుత్ ఉచిత పథకాన్ని ఆమె ప్రారంభించి జీరో బిల్లును వినియోగదారులకు అందజేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది రమేష్ ఉన్నారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్) : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లయ్యగారి ఆకాష్ అన్నారు. సోమవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో గృహజ్యోతి జీరో బిల్లు రసీదులను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోట రాజు నాయకులు గంగాగౌడ్, రామాగౌడ్, సంగమేశ్వర్, ట్రాన్స్‌కో జూనియర్ లైన్‌మన్ రాజు తదితరులు ఉన్నారు.

సైడ్‌వాల్ నిర్మాణం పూర్తి



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని సుల్తాన్‌నగర్ శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువ వంతెనకు సైడ్‌వాల్ నిర్మాణం చేపట్టారు. ప్రధాన కాలువ వంతెన రెండు వైపులా సైడ్‌వాల్ కూలిపోవడంతో బైక్‌లు ఇటీవల ప్రమాదాలకు గురయ్యారు. ఈ విషయాన్ని 'సాక్షి'లో పలుమార్లు కథనాలు ప్రచురించడంతో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు స్పందించారు. వెంటనే సైడ్‌వాల్ నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. స్పందించిన ఆర్‌అండ్‌బీ ఏఈ నందు సైడ్ వాల్‌ను పరిశీలించి వాల్ నిర్మాణాన్ని పూర్తి చేయించారు. దాంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

స్థలం ఇచ్చిన కుటుంబానికి చెక్కు అందజేత



రామారెడ్డి : మండలంలోని మోషన్ పూర్ గ్రామానికి సంబంధించిన ఎరుకల సాలవ్వ తన 15 గుంటల స్థలంలో వైకుంఠధామం నిర్మాణానికి అనుమతినిచ్చారు. జిల్లా కలెక్టర్ నిధుల నుంచి రూ. 4 లక్షల 50వేల చెక్కును ఈ సందర్భంగా రామారెడ్డి ఎంపీడీవో సవిత సోమవారం ఎరుకల సాలవ్వకు అందజేశారు. 15 గుంటల స్థలాన్ని మోషంపూర్ జీపీ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు.

విద్యార్థుల సేవలు అభినందనీయం

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని దుర్కిలో మూడు రోజులుగా ఎస్ఆర్ఎన్‌కే విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంప్‌ను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంచడానికి చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. విద్యార్థులు గ్రామంలో వీధులను శుభ్రంచేశారు. కార్యక్రమంలో పోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులున్నారు.



బీడీ కార్మికుల ఆస్పత్రి సేవలు పునరుద్ధరించాలి

కామారెడ్డి టౌన్ : కేంద్ర ప్రభుత్వం బీడీ దవాఖానావైద్య సేవలను పునరుద్ధరించాలని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంగం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి శివ్వంది సత్యం సోమవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని బీడీ దవాఖాన ఆధ్వర్యంలో వారినికి ఒకసారి మోబైల్ వ్యాన్ ద్వారా మండల కేంద్రాలలో వైద్య సేవలు నిలిపేశారన్నారు. తిరిగి ప్రారంభించాలని కోరారు.

అయోధ్యకు తరలిన భక్తులు



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

కామారెడ్డి టౌన్ : జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని భక్తులు సోమవారం ప్రత్యేక రైలులో కామారెడ్డి రైల్వే స్టేషన్ నుంచి తరలివెళ్లారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం 1453 మంది రామ భక్తులు అయోధ్యకు తరలివెళ్లారు. శ్రీ రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అభియాన్ రాష్ట్ర కన్వీనర్, కామారెడ్డి ఎమ్మెల్యే కే వెంకటరమణరెడ్డి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలానికి చెందిన భక్తులు బుధవారం యూపీలో నూతనంగా నిర్మించిన అయోధ్య రామందిరానికి వెళ్లారు. అయోధ్య రామమందిర్ దర్శన్ అభియాన్ భాగంగా ప్రత్యేక రైలు ద్వారా వెళ్లనున్నట్లు భక్తులు తెలిపారు. భక్తులు అరవింద్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, దత్తు, మహేష్, రాఘవరెడ్డి, రాకేశ్ రావు, చందు రాజు, శ్రీధర్, సుధాకర్ రెడ్డి తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

ఎల్లారెడ్డి రూరల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రామభక్తులు సోమవారం అయోధ్యకు తరలి వెళ్లారు.మండలంలోని పలు గ్రామాలకు చెందిన రామభక్తులు కామారెడ్డి నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రైలులో అయోధ్యకు తరలి వెళ్లారు వీరికి బీజేపీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి దేవేందర్ తదితరులు అభివాదం తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మల్లన్న కల్యాణోత్సవం



మల్లన్న కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కామారెడ్డి అర్బన్ : పట్టణంలోని గోల్లవాడ యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శ్రీమల్లన్న ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అగ్నిగుండాల్లో నడవడం, అన్నదానం చేశారు. మల్లన్న పటాలు వేసి ఒగ్గుకథను చెప్పారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం, యువజన సంఘం ప్రతినిధులు, స్థానికులు పాల్గొని పూజలు చేశారు.

దేవాగౌడ్‌కు అవార్డు ప్రదానం



కామారెడ్డి అర్బన్ : స్థానిక కళాభారతిలో నిర్వహించిన మహాశివరాత్రి నృత్యోత్సవంలో జనపద కళాకారుడు కే.దేవాగౌడ్‌కు వేద విద్యానందగిరి స్వామి మహానంది అవార్డు ప్రదానం చేశారు. పాల్వంచ ఫరీదుపేటకు చెందిన దేవాగౌడ్ కవి, రచయిత, గాయకుడు, నృత్యదర్శకులుగా అనేక అవార్డులు అందుకున్నారని వేద విద్యానందగిరి ప్రశంసించారు.

పన్నులు చెల్లించి సహకరించాలి

నిజాంసాగర్(జుక్కల్) : ఇంటి పన్నులు, లైసెన్స్‌లు ఫీజులు చెల్లించి అభివృద్ధి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి గంగారాం కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఇంటి పన్నులు, లైసెన్స్ ఫీజుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఆయన వెంట కారోబార్ సాయిలు తదితరులు ఉన్నారు.



సంక్షిప్తం

ప్రమాద బీమా చేయించుకోవాలి

రాజంపేట : 18 ఏళ్ల నుంచి 65ఏళ్ల లోపు వారు ప్రమాద బీమా చేయించుకోవాలని జిల్లా పోస్టల్ అధికారి జనార్దన్ అన్నారు. సోమవారం ఇనాంతండాకు చెందిన చవాన్ బాల్ సింగ్ పోస్టల్ పాలసీ తీసుకుని ప్రమాదవశాత్తు మరణించగా ఆయన కుటుంబానికి రూ. 10 లక్షల చెక్కును అందజేశారు. ఏఎస్‌పీ భూమన్న , మేనేజర్ పవన్‌రెడ్డి, రాజంపేట ఎస్‌పీఎం భిక్షపతి, ఎంటలు వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

బీర్కూర్ బీజేపీ మండల అధ్యక్షుడిగా సాయికిరణ్

బాన్సువాడ : బీర్కూర్ మండల బీజేపీ అ ధ్యక్షుడిగా నాగేళ్ల సాయికిరణ్‌ను సోమవా రం జిల్లా అధ్యక్షురాలు అరుణతార నియమించారు. వరుసగా రెండోసారి మండల అధ్యక్షుడిగా సాయికిరణ్ ఎన్నికయ్యారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మాచారెడ్డి : మండలంలోని సోమారంపేటలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, మోజ్యా, నారాగౌడ్,గంగారాం, రమేష్, లింగం, నాగరాజు ఉన్నారు.

పరీక్ష ప్యాడ్ల అందజేత

ఎల్లారెడ్డి : మండలంలోని అడవి లింగాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన దయాకర్ అనే యువకుడు పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. హెచ్‌ఎం శివ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

బీబీపేట: మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేష్, నాయకులు పాత రాజు, భూమాగౌడ్, స్వామి పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలో రెడ్డిపేటలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సాగౌడ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు దంచింగ్ నాయక్, బొజ్జానాయక్ తదితరులున్నారు.

ప్రెస్‌క్లబ్‌కు భవనం కేటాయించాలి

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌కు పాత తహసీల్దార్ కార్యాలయాన్ని కేటాయించి, అలాట్‌మెంట్ లెటర్‌ను ఇవ్వాలని జర్నలిస్టులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఏవోకు ఆదేశించారు. జర్నలిస్టులు రజనీకాంత్, ఆంజనేయులు, శ్రీనివాస్, శ్రీకాంత్, శివ, సురేష్, రాజేశ్ తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

భిక్కనూరు/దోమకొండ/రాజంపేట/మాచారెడ్డి/బీబీపేట: భిక్కనూరులో కల్యాణలక్ష్మి లబ్దిదారులకు ఎంపీపీ గాలిరెడ్డి సోమవారం చెక్కులను అందజేశారు. దోమకొండలోని రైతు వేదికలో సోమవారం జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. రాజంపేటలోని రైతు వేదికలో చెక్కులను తహసీల్దార్ అనిల్ కుమార్ అందజేశారు. మాచారెడ్డిలోని గజ్యానాయక్ తండాలో జెడ్పీటీసీ రాంరెడ్డి చెక్కులను అందించారు. బీబీపేటలో రైతు వేదికలో జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ ప్రేమ్‌కుమార్ కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులందజేశారు.